## కేసీఆర్‌ను కలిసిన నాయకులు





బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పీఎల్ శ్రీనివాస్, కొనతం లక్ష్మణ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి

*ఎమ్మెల్సీ కవిత*



ఎమ్మెల్సీ కవితను మర్యాద పూర్వకంగా కలిసిన ఎన్నారైలు

నేరేడ్‌మెట్, డిసెంబర్ 7: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. గురువారం యూకే ఎన్నారైలు ఎమ్మెల్సీ కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై బీఆర్ఎస్ ఫౌండర్ అనిల్ కుర్మాచలం, యూకే అధ్యక్షుడు అశోక్‌గౌడ్, రత్నాకర్ కందుల, నవీన్‌రెడ్డి, మహేశ్ యాదవ్, సుభాష్‌రాజ్ కుమార్, శ్రీనివాస్ వల్లాల, చంద్రశేఖర్ గౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీతాకల్యాణం నృత్య నాటకం



సీతాకల్యాణం నృత్యనాటక ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

రవీంద్రభారతి, డిసెంబర్ 7 : గో రక్షక్ సేవా సమితి ఆధ్వర్యంలో రవళి ఆర్ట్స్ అధినేత రవళి రమేశ్ బాబు శిష్య బృందంచే సీతాకల్యాణం కూచిపూడి నృత్య నాటక ప్రదర్శన రవీంద్రభారతిలోని మొయిన్‌హాల్‌లో జరిగింది. సీతాకల్యాణంలో విష్ణువుగా మధు, లక్ష్మీదేవిగా సరయు, రాముడిగా మేఘన, సీతాదేవిగా వైష్ణవి, దశరథుడిగా కృష్ణ, కౌసల్యగా ప్రవళిక, సుమిత్రగా సరయు, కైకేయిగా శివాణి, జనకుడిగా వెంకటేశ్వరరావు, విశ్వామిత్రుడిగా శివరామకృష్ణ, రావణాసూరుడిగా ఓంశ్రీ ప్రజ్ఞా, లక్ష్మణుడిగా సృజన, భరతుడిగా మాన్యశ్రీ తదితరులు అద్భుతంగా నటించారు. అనంతరం పలువురు కళాకారులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గో రక్షక్ సేవా సమితి అధినేతలు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా గ్యాస్ సిలిండర్ విక్రయిస్తే.. జైలుకే

**పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్**



సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): గ్యాస్ బండను పంపిణీ చేయడంలో ఆయా చమురు సంస్థల డీలర్లు అప్రమత్తంగా ఉండాలని, ఏజెన్సీల్లో పనిచేసే సిబ్బంది దందాకు పాల్పడితే డీలర్లపై చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. తుర్కయాంజాల్‌లో ఆయన మాట్లాడుతూ తుర్కయాంజాల్ నుంచి హస్తినాపురం ప్రాంతానికి అక్రమంగా గ్యాస్ సిలిండర్లను తరలిస్తుండగా.. వాటిని స్వాధీనం చేసుకొని స్థానిక ఏజెన్సీకి అప్పగించినట్లు తెలిపారు. కర్మాన్‌ఘాట్‌లోని ఐశ్వర్య గ్యాస్ ఏజెన్సీ నుంచి ఫిరోజ్ అనే వ్యక్తి 60 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను పక్కదారి పట్టించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఆ ఏజెన్సీపై చర్య తీసుకోవాల్సిందిగా హిందుస్తాన్ పెట్రోలియం సంస్థను కోరనున్నట్లు తెలిపారు.

# విశ్వనగరంలో.. రమ్యమైన రాతి ఆకృతులు..


ఆకట్టుకుంటున్న సహజమైన పురాతన రాతి శిలలు

నగరం చుట్టూ వేల ఏండ్ల కిందట ఏర్పడిన శిలాజ సంపద

హిమాలయాలకంటే పురాతనమైనవిగా గుర్తింపు

*ప్రతి ఆదివారం ట్రెక్కింగ్‌కు వెళ్తున్న పర్యాటకులు*





సిటీబ్యూరో, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): అద్భుతమైన, రమ్యమైన రాతి ఆకృతులు హైదరాబాద్ సొంతం.. నగరం చుట్టూనే కాకుండా దక్కన్ పీఠభూమిగా పేరొందిన తెలంగాణలో సైతం వినూత్నమైన రాతిగుట్టల వరుసలు తెలంగాణకు కిరీటంలా ఉన్నాయని చరిత్రకారులు చెబుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరం చుట్టూ పలు ప్రాంతాల్లో వివిధ ఆకారాలతో సహజమైన పురాతన రాతి శిలలు ఆకట్టుకుంటున్నాయి. నగరం చుట్టూ వేల ఏండ్ల నాడే ఏర్పడిన శిలాజ సంపదను పలు సందర్భాల్లో ఆర్కియాలజిస్టులు వెలికితీసిన విషయం తెలిసిందే. ఇక్కడ వెలిసిన రాతి శిలలు హిమాలయాలకంటే పురాతనమైనవిగా ఆర్కియాలజిస్టులతో పాటు చరిత్రకారులు సైతం శాస్త్రీయంగా విశ్లేషించి చెప్పగలిగారు.

### పోతపోసినట్టే.. రాతి శిలల ఆకృతులు..


ప్రధానంగా నగరంలోని ఫక్రుద్దీన్ గుట్టపై వేల ఏండ్ల నాటి రాతి శిలలు వందల ఎకరాల్లో పరుచుకొని ఉన్నాయి. అక్కడ అద్భుతమైన రాతి ఆకృతులు సహజంగానే రూపుదిద్దుకున్నాయి. అక్కడి శిలల్లో ఫక్రుద్దీన్ గుట్టకు పశ్చిమాన కూర్మము (తాబేలు), మనిషి పాదాలు, దొంతరాళ్లు (ఒకటిపై మరొకటి పేర్చినట్లు), పీట ఆకారం, మరీ ముఖ్యంగా అక్కడి పరుపు బండపై చిర్రగొనె (గిల్ల దండ) ఆడేందుకు వీలుగా ఉన్న రాతి ఆకారాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. ఆ గుట్టపైనే గుడి ఆకారంలోనూ భారీస్థాయి బండ రాళ్లు ఉన్నాయి. అంతేగాకుండా ఖాజాగూడ చెరువులో సైతం రాతిశిలలు పోతపోసినట్టే ఉన్నాయి. ఇక మెహర్ బాబా ధ్యాన మందిరం భక్తులను ఆకట్టుకుంటున్నది. గుహ లాగా ఉన్న ఈ ధ్యాన మందిరంలో కొద్ది క్షణాలు గడిపి ధ్యాన ముద్రలో తరిస్తుంటారు. దీంతో పాటు ఫక్రుద్దీన్ గుట్టపై స్నాన గుండం సైతం అందరినీ ఆకట్టుకునేలా ఉంది. రాతిగుట్టపైనే భారీస్థాయిలో బావిలాగే ఉండటం, ఆ గుండంలో ఎప్పటికీ నీళ్లు ఉండటం కూడా అక్కడి ప్రత్యేకత.

### నగర నలుమూలల్లో ఆదిమానవుల ఆవాసాలు

శామీర్‌పేట పరిధిలోని శ్రీవేంకటేశ్వర గుట్టపై అనేక ఆకారాలతో కూడిన శిలలు ప్రకృతిలో పరవశింపజేసే విధంగా అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. వేంకటేశ్వర స్వామి భక్తులు అక్కడి ఆలయానికి వెళ్లినప్పుడు.. గుడి ఆక్రుతిలో ఎత్తైన రాతి గుట్టను సందర్శించిన తర్వాతే వెనుదిరుగుతారని పర్యాటకులు చెబుతున్నారు. కొంగరకలాన్, పెద్ద అంబర్‌పేట ప్రాంతాల్లో కూడా అనేక గుట్టలు ఔటర్‌పై వెళ్లే ప్రయాణికులను పలుకరిస్తున్నట్టు అగుపిస్తాయి. నడి నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మౌలాలీ, యాప్రాల్ పరిధిలోని నాగమందిర్ టెంపుల్ వెనకాల ఉన్న గుట్టలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రధానంగా జూబ్లీహిల్స్‌లోని బీఎన్ రెడ్డి హిల్స్‌లోని రాతిశిలల్లో ఇటీవలే 6వేల ఏండ్ల నాటి పనిముట్లు కూడా లభించడం చూస్తే పురాతన కాలంలోనే ఇక్కడి రాతిశిలలు ఆదిమానవులు ఆవాసాలుగా ఏర్పర్చుకొనేందుకు ఉపయోగకరంగా ఉండటం విశేషం.

# డెంగీతో.. జర జాగ్రత్త

**గ్రేటర్‌లో విజృంభిస్తున్న డెంగీ ❖ వారం పది రోజులుగా పెరుగుతున్న కేసులు**



సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో డెంగీ జ్వరం మరోసారి విజృంభిస్తున్నది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో డెంగీ కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. దోమల వృద్ధి కారణంగా డెంగీ బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. గడిచిన సంవత్సర కాలంలో గ్రేటర్ వ్యాప్తంగా సుమారు 3000కు పైగా డెంగీ కేసులు నమోదైనట్లు అధికారిక రికార్డుల ద్వారా తెలుస్తున్నది. డెంగీ నివారణ చర్యల్లో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి బస్తీ దవాఖాన, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా, జిల్లా దవాఖానలతో పాటు గాంధీ, ఉస్మానియా, నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌లో మెరుగైన చికిత్సను అందుబాటులో ఉంచిన విషయం తెలిసిందే. అయితే తాజాగా గడిచిన వారం పది రోజులుగా మరోసారి గ్రేటర్‌లో డెంగీ కేసులు పెరుగుతున్నట్లు తెలుస్తున్నది.

### బస్తీ దవాఖానల్లో అందుబాటులో వైద్యం

డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలకు సంబంధించిన వైద్య పరీక్షలను అన్ని బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటి, రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డా.వెంకటేశ్వర్లు వెల్లడించారు. బస్తీ, పీహెచ్‌సీలలో పూర్తిస్థాయి వైద్యం అందుబాటులో ఉన్నదని, రోగి పరిస్థితి తీవ్రంగా ఉండి, దవాఖానలో అడ్మిట్ చేయాల్సిన పరిస్థితి ఉంటే గాంధీ, ఉస్మానియా లేదా నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌కు రెఫర్ చేస్తున్నట్లు తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్

## బీసీ ఎమ్మెల్యేలు డిప్యూటీ సీఎంకు అర్హులు కారా?

రవీంద్రభారతి, డిసెంబర్ 7 : దేశ జనాభాలో 62శాతం ఉన్న బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వకుండా బీసీలను అవమానపరిచారని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో సగభాగమున్న బీసీలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. అదేవిధంగా మంత్రుల శాఖల కేటాయింపులో కూడా బీసీ ఎమ్మెల్యేలకు చిన్న శాఖలను కేటాయించడం దారుణమన్నారు. ఈ విషయంపై ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, రఘునాథ్, లక్ష్మయ్య, మల్లేశ్, సాయివర్ధన్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.